క్లుప్తంగా

కొనసాగుతున్న ఆధార్ నమోదు డ్రైవ్



కంకిపాడు: మండలంలో ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు కొనసాగుతున్నాయి. ఈడుపుగల్లు-2, మంతెన సచివాలయం, గొడవర్రు సచివాలయాల్లో బుధవారం ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించారు. ఎంపీడీఓ పి.అనూష పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేశారు. ఆధార్ నమోదు, సవరణల అర్జీలను స్వీకరించి క్యాంపుల్లో పరిష్కరించారు. ఈనెల 24, 25 తేదీల్లో వేల్పూరు సచివాలయం, కోలవెన్ను సచివాలయం, దావులూరు సచివాలయాల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

2 నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు

గన్నవరం: నవంబర్ 2వ తేదీ నుంచి కార్తిక మాసం సందర్భంగా గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్‌లు ప్రతి ఆదివారం, సోమవారం స్థానిక బస్టాండ్ నుంచి తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరతాయన్నారు. పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శైవక్షేత్రాల సందర్శన అనంతరం బస్సులు అదే రోజు రాత్రికి గన్నవరం చేరుకుంటాయని తెలిపారు. పంచారామాలకు వెళ్లేందుకు లగ్జరీ బస్సు చార్జి రూ.1,150, అల్ట్రా డీలక్స్ చార్జి రూ.1,080గా నిర్ణయించామన్నారు. ఒకే గ్రామం నుంచి 35 మంది ప్రయాణికులు ఉంటే ఆ గ్రామం నుంచే బస్సు సర్వీసు నడుపుతామన్నారు. ఇతర సమాచారానికి 87909 96090, 73829 05633 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రత్యేక బస్సు సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని శివాజీ కోరారు.

పెరికీడు గ్రామ సచివాలయంలో చోరీ



హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గ్రామ సచివాలయంలో బుధవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామ సచివాలయం తలుపులు బద్దలుకొట్టి లోపల ఉన్న కంప్యూటర్ ప్రింటర్, సౌండ్ స్పీకర్, ఇతర ఆఫీసు సామగ్రిని దొంగిలించారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపులు తెరిచి ఉండటం చూసి ఆందోళన చెందారు. కార్యాలయంలో చోరీ జరిగినట్లుగా గుర్తించిన సచివాలయం సిబ్బంది హనుమాన్‌జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వి.సురేష్ సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలను సేకరించారు. ఈ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు పోలీసుల బెదిరింపులు

కంకిపాడు: వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పుట్టిన రోజు సందర్భంగా వేల్పూరు గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు రెండు ప్రధాన సెంటర్లలో అభిమానాన్ని చాటుకుంటూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కంకిపాడు పోలీసులు బ్యానర్లు ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తలకు ఫోన్ చేసి ఉద్యోగం చేసుకునే వాళ్లకు బ్యానర్లు ఎందుకు? బ్యానర్లు తీసేయాలని లేకుంటే నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. దీంతో వారు రెండు బ్యానర్లను తీసివేశారు. నోటీసుల జారీ హెచ్చరికలపై ఎస్‌ఐ డి.సందీప్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

నున్నలో మద్యం దుకాణం తొలగించాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మంచినీటి చెరువును, వాకింగ్‌ట్రాక్ ఆనుకొని ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని మహిళలు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం వాకింగ్ చేసేందుకు వచ్చిన మహిళలు గంగానమ్మ గుడి ఒక వైపు, జిల్లా పరిషత్ హైస్కూల్ మరో వైపు ఉండగా వాటికి దగ్గరలో మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో మందుబాబులు తాగిన మద్యం సీసాలను ప్రజలు నీరు తాగే చెరువుల్లో డంప్ చేస్తారని, అటు వైపు మహిళలు వాకింగ్ చేసుకునే వీలు ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాన్ని బడికి, గుడికి దూరంగా ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పేదల సొంతింటి కల నెరవేరేనా.. ?

- నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా పనులు
- మార్చి డెడ్‌లైన్‌తో ఆందోళనలో లబ్ధిదారులు



మానికొండలోని జగనన్న కాలనీ

ఉంగుటూరు: జగనన్న ఇళ్ల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విధిస్తున్న ఆంక్షలతో పేదల సొంతింటి కల కలగానే మిగిలే విధంగా ఉందని పలువురు వాపోతున్నారు. పక్కా ఇళ్లకు వచ్చే ఏడాది మార్చి తర్వాత కేంద్రం నిధులు నిలిపి వేస్తోందని, అప్పటిలోగా పూర్తి చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. లక్ష్యాలు నిర్దేశించిన ప్రభుత్వం దానికి అనుగుణంగా సాధనకు అడుగులు వేయడంలేదు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాల్సి ఉన్నా మన ఇల్లు మన గౌరవం పేరుతో అవగాహన సదస్సులు పెడుతూ కాలయాపన చేస్తోందని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో 2,757 ఇళ్ల మంజూరు చేసింది. జగనన్న కాలనీ 28 లేఅవుట్లలో 2,250 ఇళ్లు, సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు 507 మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి నాంది పలికారు. గత ప్రభుత్వంలో యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నిరంతరాయంగా నిర్మాణాలు కొనసాగాయి. సకాలంలో బిల్లులు రావడంతో లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టారు. ఇలా ఇప్పటి వరకు 870 గృహాలు అన్ని హంగులతో పూర్తికాగా, పునాది, రూఫ్‌లెవల్ దశలో 530 ఉన్నాయి. ఇంకా ప్రారంభం కానివి 1,357 ఇళ్లు ఉన్నాయి. వీటి పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వం స్థలాలిచ్చి ఇళ్ల మంజూరు చేసింది. మార్చి వరకు పూర్తికాకపోతే నిధులు మంజూరు కావని ప్రస్తుత ప్రభుత్వం చెబుతోంది. ఇంకా ప్రారంభించని వారి పరిస్థితేంటన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

నత్తనడకన పనులు..



ఇంటికి శ్లాబ్ వేస్తున్న కార్మికులు

పీఎంఏవై కింద పేదలు నిర్మించుకుంటున్న గృహాలకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందజేస్తోంది. ప్రస్తుతం నిర్మాణాల్లోని ఇళ్లకు వచ్చే ఏడాది మార్చి తర్వాత కేంద్రం నిధులు ఇవ్వదని చెబుతున్నారు. నిధులు సద్వినియోగం చేసుకునేలా హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే అప్పులు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అధికారులు డెడ్‌లైన్ విధించడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

జీతాలు చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికుల ధర్నా



పోరంకిలో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

పెనమలూరు: ప్రభుత్వం తమకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ పోరంకిలో తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం ధర్నా చేశారు. మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ.. తడి, పొడి చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించలేదన్నారు. జీతల కోసం కార్మికులు 10 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించటం లేదని ఆరోపించారు. జీతాలు లేకుండా కార్మికులు, వారి కుటుంబాలు ఎలా జీవిస్తారని అధికారులను ప్రశ్నించారు. కార్మికులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోని కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నాయ్యం చేస్తామని మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చినా న్యాయం జరగలేదన్నారు. ధర్నాలో వ్యాన్ డ్రైవర్లతో పాటు మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.సరళ, ఎం.కొండలు, రత్నకరుణ, కె.విజయ, లక్ష్మి, షేక్.మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య చర్యలతో పొడ తెగులు నివారణ



తెన్నేరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంకిపాడు: వరి పైరులో యాజమాన్య చర్యలు చేపట్టడం ద్వారా పొడ తెగులు నివారణ సాధ్యమని డీఆర్సీ సెంటర్ డీడీఏ జ్యోతి రమణి సూచించారు. మండలంలోని తెన్నేరు, మారేడుమాక గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పైరులో పొడతెగులు ఉండటాన్ని గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. డీడీఏ జ్యోతి రమణి మాట్లాడుతూ పొడ తెగుల నివారణకు కాంటాఫ్, ప్లాంటామైసిన్ మందును వినియోగించాలన్నారు. కాంటాఫ్ ఒక లీటరు మూడు ఎకరాలకు, ప్లాంటామైసిన్ 100 ఎంఎల్ ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. దోమ నివారణకు చెస్ 100 గ్రాములు ఒక ఎకరాకు చల్లాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్సీ – 8 ఏఓ పద్మజ, పామర్రు ఏడీఏ స్వర్ణలత, మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్, వీఏఏ శివకృష్ణ రైతులు పాల్గొన్నారు.

112 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారులు

రామవరప్పాడు: 9వ ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాల సందర్భంగా విజయవాడ రూరల్ మండలం గూడవల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారి పి.మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కాచి చల్లార్చిన తాగునీటిని వినియోగించాలని, పోషకాలు గల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. 112 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి లక్ష్మిమానస, కాంపౌండర్ కోటేశ్వరరావు, హెచ్‌ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిగుంట – తెన్నేరు రోడ్డు అభివృద్ధి చేయాలి



తెన్నేరులో పాదయాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు

కంకిపాడు: గుంతలమయంగా ఉన్న కోమటిగుంట – తెన్నేరు రోడ్డును అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు డిమాండ్ చేశారు. కోమటిగుంట లాకులు నుంచి తెన్నేరు వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండటంతో అభివృద్ధి చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ.. నాలుగు కిలోమీటర్లు మేరకు ఉన్న రోడ్డు గోతులతో అధ్వానంగా ఉందన్నారు. లాకులు నుంచి కోమటిగుంట, జగన్నాథపురం, తెన్నేరు, క్రిస్టియన్‌పేట ప్రాంతాలతో పాటు తెన్నేరు రైల్వేస్టేషన్‌కు ఇదే ప్రధాన మార్గమన్నారు. రోడ్డు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు సీహెచ్ శ్రీహరి, జె.రవి, యేసు, బెనర్జీ, సుందరం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవ కేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు



సదస్సులో మాట్లాడుతున్న ఏఓ తేజస్వి

అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎస్‌ఎల్.తేజస్వి మాట్లాడుతూ.. రైతులు పండించిన ఖరీఫ్ వరి ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు ఉచితంగా గోనె సంచులు సరఫరా చేయడంతో పాటు రవాణా, కూలీల చార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందని చెప్పారు. వరి ధాన్యం సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300, గ్రేడ్ ఎ రకం రూ.2,320 మద్దతు ధరగా నిర్ణయించారన్నారు. దళారుల చేతిలో చిక్కుకుని తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుని నష్టపోవద్దని రైతులకు సూచించారు. గ్రామ సర్పంచ్ డొక్కు సాంబశివవెంకన్నబాబు, పలువురు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

- తాడిగడప మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు
- స్పందించని అధికారులు



కానూరులో పేరుకుపోయిన చెత్త

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే ప్రజలు జ్వరాలు, జలుబు, గొంతు నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి తోడు మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం క్షీణించటంతో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి.

వివరాల్లోకి వెళితే తాడిగడప మున్సిపాలిటీలో యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప సెక్టార్లు ఉన్నాయి. గ్రామాల్లో చెత్త తరలించటానికి వ్యాన్‌లు గత ప్రభుత్వం ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహించింది. ప్రతి రోజు తడి, పొడి చెత్తను సకాలంలో తరలించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెత్త తరలింపు పెద్ద సమస్యగా మారింది. చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించటం లేదు. ప్రస్తుతం మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవటంతో కార్మికులు అధికారులు, నేతల చుట్టూ తిరిగి జీతాల కోసం అభ్యర్థించారు. అయితే ప్రభుత్వం నుంచి స్పందన కరువవ్వటంతో సమ్మెబాట పట్టారు. గత 10 రోజులుగా చెత్త తరలించే వారు లేక మున్సిపాలిటీ మొత్తం చెత్తమయంగా మారింది.

ప్రత్యామ్నాయం లేదు

గత 10 రోజులుగా చెత్త తరలించక పోవటంతో గ్రామాలలో పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రధాన రహదారులపై చెత్త కుప్పలు గుట్టలుగుట్టలుగా పేరుకు పోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామాల్లో ప్రజలు రోగాల బారిప పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో రోజు టన్నుల కొద్ది చెత్త వస్తుంది. అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూడక పోవటంతో చెత్త సమస్య తీవ్రంగా మారింది. పరిస్థితులు అదుపు తప్పక ముందే అధికారులు చెత్త తొలగించే విషయంలో చొరవ చూపాలని, పారిశుద్ధ్యం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు గ్రామంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువరం మహాదేవపురం కాలనీ సబ్‌స్టేషన్ పరిధి తులసీనగర్‌లో ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా తులసీనగర్, వరలక్ష్మీపురం, పంట కాలువ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. స్థానికులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తుకు గడువు పొడిగింపు

పెనమలూరు: డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించామని సాంఘిక సంక్షేమ శాఖాధికారి షేక్. షాహిద్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వటానికి ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 21తో ముగిసినా ఎక్కువ మంది అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవటానికి గడువును ఈ నెల 25 తేదీ వరకు పెంచామన్నారు. అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టండి

కంకిపాడు: వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు జిల్లా పంచాయతీ అధికారికి విన్నవించారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వీధి కుక్కల బెడద సమస్యను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రమైన కంకిపాడులోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో వృద్ధులు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి పత్రం పంపారు.

పెనమలూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పెమలూరులో ఓ వ్యక్తిపై దాడి ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు వంతెన డౌన్‌లో అన్నవరపు వీరరాజేష్ బార్బర్ షాపు నిర్వహిస్తాడు. మంగళవారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన కొలువుకంటి సుధీర్ బార్బర్ షాపునకు కటింగ్ చేయించుకోవటానికి వచ్చాడు. షాపులో సుధీర్ రాజకీయాలు మాట్లాడుతుండగా వీరరాజేష్ వద్దని వారించాడు. దీంతో సుధీర్ ఆగ్రహించి దుర్భాషలాడి వెళ్లాడు. మళ్లీ సాయంత్రం సుధీర్ కొంత మంది వ్యక్తులతో వచ్చి రాజేష్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వికాస్ కాలేజీలో డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ట్రైనర్ మారుతీ ప్రసాద్ యాదవ్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బుధవారం గరుడా ఏరోస్పేస్ సంస్థ ఆధ్వర్యంలో 5 రోజుల డ్రోన్ పైలెట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గరుడా ఏరోస్పేస్ ట్రైనర్ డాక్టర్ జి.మారుతీప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ డ్రోన్ పైలెట్‌లో శిక్షణ తీసుకోవడం వలన ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎస్.కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో డ్రోన్ ఆవశ్యకత ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు డ్రోన్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డీన్, డాక్టర్ శివగరాజన్, ట్రైనర్స్ డాక్టర్ బిబేకానంద పాధి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేంద్ర కుమార్, టీపీఓ ఎస్.కిషోర్ బాబు, కన్వీనర్ అండ్ ఈసీఈ వీవీ రెడ్డి, కో ఆర్డినేటర్లు జి.సురేష్, జి.రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెత్త నిల్వల తరలింపునకు చర్యలు



చెత్త తరలింపుపై అధికారులతో చర్చిస్తున్న డీపీఓ అరుణ

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు అధికారులు మరోసారి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి అరుణ బుధవారం ప్రజాప్రతినిధులతో కలిసి సదరు చెత్త నిల్వలను పరిశీలించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఇక్కడి చెత్త నిల్వలను సాధ్యమైనంత త్వరగా బయటకు తరలించాలని అధికారులను డీపీఓ ఆదేశించారు. చెత్త తరలింపునకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. చెత్తను నిల్వలను తరలించేందుకు పరిసరా గ్రామాల్లో అనువైన స్థలాలను గుర్తించాలని తెలిపారు. ఇక్కడి చెత్తను పూర్తిగా తొలగించి, ఈ ప్రాంతంలో చెట్లను నాటడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని చెప్పారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఉప సర్పంచ్ పొలడుగు నాని, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, శౌంఠి కిషోర్, ఎంపీడీఓ స్వర్ణలత, ఈఓపీఆర్డీ భారతి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు. అయితే చెత్త తరలింపు పనులు దక్కించుకునేందుకు టీడీపీలోని రెండు గ్రూపులు ఇప్పటికే పోటీ పడుతున్నాయి.

రైతులకు పంటల ధ్రువీకరణ పత్రాల జారీ



యనమలకుదురులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఏఓ శైలజ

పెనమలూరు: మండల పరిధిలో రైతులకు పంటల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం యనమలకుదురు, గంగూరు గ్రామల్లో రైతులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో పంటల నమోదు ధ్రువీకరణ పత్రాలు నమోదు పూర్తి చేసి రైతులకు పత్రాలు అందజేస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సంబంధిత పరికరాలు రైతు సేవా కేంద్రాలకు వచ్చాయని చెప్పారు. రబీ పంట సాగుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని రైతులు కోరారు. రబీ ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు అంజూమ్, అహల్య, రైతులు పాల్గొన్నారు.

ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ఉంగుటూరు: రెవెన్యూ అధికారులు తాత్సారం వలన ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందడం లేదు. ఉంగుటూరు మండలంలో పలు గ్రామాల నుంచి ప్రజలు సంక్షేమ పథకాలు, విద్యార్థుల చదువుల కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయం, మీ సేవాల ద్వారా సుమారు 200 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉంగుటూరు మండలంలో ఇటీవల జరిగిన బదిలీలు జరిగిన నాటి నుంచి నేటి వరకు ఒక్క సర్టిఫికెట్‌ను మంజురు చేయకపోవడంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు రెండు రోజుల్లో మీ సర్టిఫికెట్లు అయిపోతాయని చెప్పి పంపిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. సుమారు 20 రోజులు గడుస్తున్నప్పటికీ సర్టిఫికెట్లు మంజూరు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డెప్యూటీ తహసీల్దారు కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా బదిలీపై రావటం వలన ఆలస్యమైందన్నారు. అందరికీ సకాలంలో ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని చెప్పారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

గన్నవరం/ఉంగుటూరు: దొంగతనం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ గన్నవరం 8వ అదనపు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవి, ఉంగుటూరు ఎస్‌ఐ గోవిందు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దావాజిగూడెం శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న చావలి మురళీకృష్ణ ఇంటిలో ఈ ఏడాది జూలై 22న చోరీ జరిగింది. 35 గ్రాముల బంగారం, కిలో వెండి వస్తువులతో పాటు రూ.30 వేలు నగదు అపహరించుకుపోయారు. ఈ కేసులో నిందితుడైన గుడివాడలోని కొత్తపేటకు చెందిన ముద్దాని జగదీష్‌ను గన్నవరం అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో మరో చోరీ కేసులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఒక్కో కేసులో రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

పల్లె పండుగ అభివృద్ధి పనులు ప్రారంభించాలి

విజయవాడరూరల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ఈ నెల 25వ తేదీ నాటికి ప్రారంభించాలని రూరల్ ఎంపీడీఓ బి.విగ్గిన్స్ గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలో మొత్తం 5 కోట్ల రూపాయలతో 25 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్‌లు శంకుస్థాపనలు చేశారని, ఆ పనులను వెంటనే ప్రారంభించాలని చెప్పారు.

మహిళలపై దాడుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కంకిపాడు: మహిళలపై దాడుల నియంత్రణకు సమర్థంగా చర్యలు తీసుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రేమోన్మాది విఘ్నేష్ చర్యతో ఇంటర్మీడియెట్ విద్యార్థిని మృతి చెందటం దారుణమన్నారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభు త్వం ఆర్థిక సాయం అందించిందని చెప్పారు. అయితే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రక్షణ చట్టాలను అమలు చేయాలని కోరారు.